క్లుప్తంగా

మర్యాదపూర్వకంగా..



ప్రసన్నకు పూలమొక్కను అందజేస్తున్న మొయిళ్ల గౌరి

కోవూరు: మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ పీఏసీ సభ్యుడు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిని ఆ పార్టీ రాష్ట్ర మహిళా విభాగం జోనల్ అధ్యక్షురాలిగా నియమితులైన మొయిళ్ల గౌరి, ఆమె భర్త సురేష్‌రెడ్డిలు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. నగరంలోని ఆయన నివాసంలో కలిసి పూలమొక్కను అందజేశారు.

ఆరోగ్య కేంద్రం తనిఖీ



మనుబోలు: మనుబోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ఖాదర్‌వలీ తనిఖీ చేశారు. వైద్యాధికారులు, సిబ్బందితో మాట్లాడారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ రాజయ్య, పీహెచ్‌ఎన్ జయలక్ష్మి, రాజన్ తదితరులు పాల్గొన్నారు.

షిర్డీలో చిన్నారుల నృత్య ప్రదర్శన



సాయిబాబా చిత్రపటాన్ని అందజేస్తున్న నిర్వాహకులు

మనుబోలు: మండలంలోని వీరంపల్లి గ్రామానికి చెందిన మస్తానయ్య, మహేశ్వరి దంపతుల కుమార్తెలు హర్షిత, హన్విత సోమవారం షిర్డీ సాయినాథుని సన్నిధిలో ఇచ్చిన కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. నెల్లూరులోని సిద్ధేంద్ర యోగి కూచిపూడి కళాక్షేత్రంలో వీరు నృత్యంలో మెళకువలు నేర్చుకున్నారు.

ట్రాక్టర్ బోల్తా



ఇందుకూరుపేట: మండలంలోని గమళ్లపాళెం, జంగంవానిదొరువు రోడ్డు మధ్య సోమవారం ట్రాక్టర్ అదుపుతప్పి పంట కాలువలో బోల్తా పడింది. అదృష్టవశాత్తు ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు. ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి ట్రాక్టర్ బోల్తా పడిందని స్థానికులు తెలిపారు.

ప్లాస్టిక్ అనర్థాలపై అవగాహన కల్పించాలి

నెల్లూరు రూరల్: సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించాలని ఇన్‌చార్జి కలెక్టర్ కె.కార్తీక్ అధికారులకు సూచించారు. ఈనెల 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని నెల్లూరు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో సోమవారం కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో అర్జీదారులకు అవగాహన కల్పించారు. జిల్లాస్థాయి అధికారులు తమ పరిధిలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను అరికట్టేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ప్రతినెలా నిర్వహించే జిల్లా పరిశ్రమల ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశంలో ప్లాస్టిక్ నిర్మూలనను అజెండాగా చేర్చి ఎప్పటికప్పుడు సమీక్షించాలన్నారు. ప్రజలు కూడా పర్యావరణ పరిరక్షణకు, భవిష్యత్ తరాల ప్రయోజనాల కోసం సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను అరికట్టేందుకు తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ అశోక్‌కుమార్ మాట్లాడుతూ ఈనెల 4న అన్ని మున్సిపాలిటీ కేంద్రాల్లో పర్యావరణ పరిరక్షణ, ప్లాస్టిక్ నిర్మూలనపై సదస్సులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 5న నగరంలో ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలతో కలిసి గ్రీన్ ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు. అనంతరం క్లాత్ బ్యాగులను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఆర్వో ఉదయభాస్కర్‌రావు, డీఆర్‌డీఏ, డ్వామా, ఏపీఎంఐపీ పీడీలు నాగరాజకుమారి, గంగాభవాని, శ్రీనివాసులు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సున్నా వడ్డీకి ఎగనామం



- పొదుపు మహిళలను మోసం చేసిన కూటమి ప్రభుత్వం
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పక్కాగా అందిన నగదు
- సర్వేపల్లిలో సున్నా వడ్డీ కింద రూ.23.89 కోట్ల జమ
- చేయూత కింద ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రూ.107.35 కోట్లు

మండలంలోని నావూరుకు చెందిన కామాక్షి పొదుపు సంఘం 2018లో పదిమంది సభ్యులు రూ.5 లక్షల బ్యాంకు రుణం తీసుకుంది. 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ఈ సంఘానికి సున్నా వడ్డీ రూపంలో సుమారు రూ.22 వేల వరకు బ్యాంక్‌లో జమ చేసింది. తర్వాత వీరు తీసుకున్న రుణాన్ని సకాలంలో చెల్లించి తిరిగి 2024లో మళ్లీ రూ.10 లక్షలు రుణం తీసుకున్నారు. ఈసారి సున్నా వడ్డీ పథకం లేకపోవడంతో వారంతా ఆవేదన చెందుతున్నారు. మొత్తం వడ్డీని వీరే చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది.



వెలుగు కార్యాలయం

పొదలకూరు: పొదుపు సంఘాల మహిళలు సున్నా వడ్డీ కోసం ఎదురు చూస్తున్నారు. తాము తీసుకున్న బ్యాంక్ రుణానికి వడ్డీని ప్రభుత్వం చెల్లిస్తే ఆర్థికంగా కొంత వెసులుబాటు దక్కుతుందని అభిప్రాయపడుతున్నారు. ఇందుకోసం ఏడాది నుంచి వారు ఎదురు చూస్తున్నా సున్నా వడ్డీ ఊసే కనిపించడం లేదు. దివంగత సీఎం వైఎస్సార్ పావలా వడ్డీ పథకాన్ని అమలు చేస్తే ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సున్నా వడ్డీని ప్రారంభించి మహిళా లోకానికి అండగా నిలిచారు. కూటమి ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. వైఎస్సార్ చేయూత పథకంలో ఎస్సీ, ఎస్సీ, బీసీలకు నాలుగు విడతల్లో రూ.75 వేలు అందజేసిన గత ప్రభుత్వం వల్ల మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకున్నారు.

45,406 మందికి..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మహిళలను ఆదుకున్నట్టు గణాంకాలు పరిశీలిస్తే తెలుస్తుంది. సర్వేపల్లి నియోజకవర్గంలో ఐదు మండలాల్లో 2019 – 23 సంవత్సరంలో వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం ద్వారా 4,546 గ్రూపుల్లో ఉన్న 45,406 మంది మహిళలకు రూ.23.89 కోట్లు బ్యాంక్‌ల్లో జమ చేసింది. చేయూత పథకం ద్వారా 27,654 మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ మహిళలకు నాలుగు విడతల్లో రూ.75 వేల వంతున రూ.107.35 కోట్లు అందజేసింది. ఫలితంగా అనేకమంది మహిళలు చిరు వ్యాపారాలు చేపట్టారు.

అమలు చేస్తే బాగుంటుంది



కూటమి ప్రభుత్వం గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలా పొదుపు సంఘాల మహిళలకు సున్నా వడ్డీని అమలు చేస్తే బాగుంటుంది. బ్యాంక్ రుణాల వడ్డీ భారం పడకుండా గత ప్రభుత్వం సున్నా వడ్డీని అమలు చేసింది. ఇప్పుడు అదే విధంగా అమలు చేయాస్తే మహిళలు ఉపయోకరంగా ఉంటుంది.

– వెళతాటి వెంకటమ్మ, పొదుపు మహిళ, చిన్నచెరుకూరు, తోటపల్లిగూడూరు మండలం

తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసనలు



ధర్నా నిర్వహిస్తున్న ఏఐటీయూసీ నాయకులు



నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

పొదలకూరు: స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం పలువురు నిరసనలు తెలిపారు. మండలంలోని ఏఐటీయూసీ వారు పేదలకు ఇంటి స్థలాలు పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ బి.శివకృష్ణయ్యకు వినతిపత్రం అందజేశారు. పేదలు చాలా మంది స్థలాలు లేకుండా ఇబ్బందులు పడుతున్నట్లు పేర్కొన్నారు.

- మండలంలోని దుగ్గుంట రామాపురం గ్రామానికి చెందిన పలువురు రైతులు తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. గ్రామంలో సర్వే నంబర్ 24బీ, 36లో 26 ఎకరాలు ఉందన్నారు. ఇందులో 63 మంది రైతులకు భూమి ఉందని అందుకు సంబందించిన పట్టాదారు పాస్ పుస్తకాలు కూడా ఉన్నాయన్నారు. అయితే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి పొలం తనకు చెందుతుందని నోటీసులు ఇవ్వడంపై మండిపడ్డారు. తహసీల్దార్‌కు రైతుల వద్ద ఉన్న ఆధారాలను సమర్పించి న్యాయం చేయాల్సిందిగా కోరారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

తోటపల్లిగూడూరు: మండలంలోని చిన్నచెరుకూరు హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో సోమవారం విద్యా ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతుల కింద రూ.50 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, ఇస్తామని నిర్వాహకులు తెలిపారు. వేలూరు కల్యాణ్‌రెడ్డి, మంచికంటి శ్యామ్, పోలంరెడ్డి విజయశంకర్, చంద్రమౌళి, నరేష్‌లు నగదు బహుతులను అందజేస్తారన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

మనుబోలు: మోటార్‌బైక్ అదుపుతప్పి పడిపోవడంతో ఇద్దరు యువకులకు గాయాలయ్యాయి. ఈ ఘటన మండల పరిధిలోని కొమ్మలపూడి రోడ్డులో రైలు వంతెన వద్ద సోమవారం జరిగింది. వివరాలు.. సూళ్లూరుపేటకు చెందిన మునిరాజా స్నేహితుడితో కలిసి బైక్‌పై కసుమూరుకు వచ్చి తిరిగి వెళ్తున్నాడు. కొమ్మలపూడి రైల్వే వంతెన కింద రోడ్డు గతుకులమయంగా ఉండటంతో బైక్ అదుపుతప్పింది. దీంతో మునిరాజాతోపాటు అతడి స్నేహితుడికి గాయాలయ్యాయి.

పెనుబల్లి వ్యక్తికి అవార్డు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని పెనుబల్లి గ్రామానికి చెందిన పర్వతారోహకుడు కేవీ సూర్యప్రకాష్ నేపాల్‌లో సోమవారం జరిగిన ఎవరెస్ట్ సమ్మిట్ 2025 కార్యక్రమంలో పాల్గొని, ఆ దేశ మంత్రి బద్రి ప్రసాద్ పాండే చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. ఈ క్రమంలో ఆయనకు జిల్లాలోని పలువురు అభినందనలు తెలిపారు.

కండలేరులో 40.089 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో సోమవారం నాటికి 40.089 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఇన్‌చార్జి ఈఈ రామచంద్రమూర్తి తెలిపారు. సత్యసాయి గంగ కాలువకు 2,360, పిన్నేరు కాలువకు 10, లోలెవల్ కాలువకు 60, హైలెవల్ కాలువకు 20, మొదటి బ్రాంచ్ కాలువకు 85 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు.

బినామీ పేర్లతో రూ.4.50 లక్షల రుణం



వివరాలు వెల్లడిస్తున్న గిరిజన మహిళలు

- వసూలు కోసం గిరిజనులపై ఒత్తిడి
- న్యాయం చేయాలంటూ ఆందోళన

మనుబోలు: అక్షరజ్ఞానం లేని తమ పేర్లతో పొదుపు గ్రూపులో రుణాలు తీసుకుని చెల్లించాలంటూ వేధిస్తున్నారంటూ మనుబోలు తూర్పు గిరిజన కాలనీకి చెందిన గిరిజనులు సోమవారం ఆందోళనకు దిగారు. బాధితుల కథనం మేరకు వివరాలు.. కాలనీకి చెందిన పదిమంది శ్రీలక్ష్మి పొదుపు గ్రూపుగా ఏర్పడి బ్యాంక్ లింకేజీ ద్వారా రూ.15 లక్షల రుణం తీసుకున్నారు. దీనికి సంబంధించిన మొత్తం, వడ్డీ కలిపి నెలనెలా చెల్లిస్తున్నారు. గతంలో వెలుగు కార్యాలయంలో పని చేసిన వీఓఏ తమ సంతకాలను ఫోర్జరీ చేసి స్త్రీనిధి ద్వారా ముగ్గురి పేరుతో ఒక్కరికిపై రూ.50 వేల వంతున రుణం తీసుకున్నట్లు తెలిపారు. అలాగే సంఘ బంధం నుంచి తమ గ్రూపు పేరుపై రూ.లక్ష, ఉన్నతి ద్వారా మరో రూ.లక్ష, స్పెషల్ రుణం కింద మరో రూ.లక్ష తీసుకున్నట్లు చెప్పారు. ఈ రుణాల సంగతి అధికారులు చెప్పే వరకూ తమకు తెలయదని వాపోయారు. తాము తీసుకున్న రుణానికి ప్రతినెలా నగదు చెల్లిస్తున్నామన్నారు. దానికి అదనంగా రూ.4.50 లక్షలు కూడా చెల్లించాలని అధికారులు ఒత్తిడి తెస్తున్నారని చెప్పారు. న్యాయం చేయకుంటే వెలుగు కార్యాలయాన్ని ముట్టడిస్తామని గ్రూపు సభ్యులు సుబ్బమ్మ, అంకమ్మ హెచ్చరించారు.

పరిసరాల పరిశుభ్రత అవసరం

ఇందుకూరుపేట : పరిసరాల పరిశుభ్రత ప్రతిఒక్కరికీ అవసరమని పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ అశోక్‌కుమార్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని మైపాడు బీచ్‌లో పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యాటకులు ఎక్కువగా ఉండే ఇలాంటి ప్రాంతాల్లో వ్యర్థాలను డస్ట్‌బిన్‌లో మాత్రమే వేయాలని కోరారు. కార్యక్రమంలో పలు పరిశ్రమల యజమానులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అశోక్‌కుమార్

4, 5 తేదీల్లో పెన్షన్, జీపీఎఫ్ అదాలత్

నెల్లూరు రూరల్: జిల్లాలో పెండింగ్‌లో ఉన్న పెన్షన్, జీపీఎఫ్ కేసులను సమీక్షించడానికి అకౌంటెంట్ జనరల్ ఆధ్వర్యంలో ఈనెల 4వ తేదీన అదాలత్ నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ ఎస్.శాంతిప్రియ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నెల్లూరులోని కస్తూర్బా కళాక్షేత్రంలో ఆరోజు కార్యక్రమం జరుగుతుందన్నారు. 5వ తేదీన వింజమూరు ఎంపీడీఓ కార్యాలయంలో అదాలత్ నిర్వహిస్తామన్నారు. అధికారులు వారి శాఖల పరిధిలో పెండింగ్‌లో ఉన్న పెన్షన్ కేసులు, ఇతర వివరాలతో హాజరుకావాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న పెన్షన్, జీపీఎస్ కేసులను సమీక్షించి అక్కడికక్కడే పరిష్కరిస్తారన్నారు. జిల్లాలోని పెన్షనర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లా ట్రెజరీ అధికారి గంగాద్రి నోడల్ అధికారిగా హాజరవుతారని వెల్లడించారు.

'వెన్నుపోటు దినం'ను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కోవూరు: చంద్రబాబు మోసాలను ఎండగడుతూ వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఈనెల 4న జరిగే 'వెన్నుపోటు దినం'ను నాయకులు, కార్యకర్తలు, ప్రజలు విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి, పార్టీ మండల కన్వీనర్ అనూప్‌కుమార్‌రెడ్డి, వైస్ ఎంపీపీ శివుని నరసింహులురెడ్డి పిలుపునిచ్చారు. కోవూరులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. కల్లబొల్లి మాటలతో ప్రజలను చంద్రబాబు మభ్యపెడుతున్నారన్నారు. హామీలను అమలు చేయకుండా అరాచక పాలన సాగిస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులు చేయడమే కాకుండా అక్రమ కేసులు బనాయిస్తున్నారన్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని ప్రజలను పీడిస్తున్నారన్నారు. హామీల అమలుపై కూటమి ప్రభుత్వంపై ఒత్తిడి తేవడానికి వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 4న నిర్వహించే ర్యాలీలో పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

వెన్నుపోటుకు ఆద్యుడు బాబు

రాజకీయాల్లో వెన్నుపోటుకు ఆద్యుడిగా చంద్రబాబు పేరుగడించారని పార్టీ నాయకులు విమర్శించారు. సూపర్‌సిక్స్ హామీలు నెరవేర్చకుండా ప్రజలను వెన్నుపోటు పొడిచారన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా నిర్వీర్యమైపోయాయన్నారు. తమ పార్టీ నాయకులు, కార్యకర్తలను భయభ్రాంతులకు గురిచేస్తూ దాడులకు పాల్పడుతున్నారన్నారు. ప్రభుత్వం ఎవరికీ శాశ్వతం కాదనే విషయం చంద్రబాబు గుర్తించుకోవాలన్నారు. రాష్ట్ర ప్రజలు ఆయనకు తగిన గుణపాఠం చెప్పే రోజులు దగ్గరలో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సతీష్‌రెడ్డి, ఆదినారాయణరెడ్డి, వెంకట రమణారెడ్డి, న్యాయవాదులు చెంచురెడ్డి, శ్యామాచార్యులు, శ్రీనివాసులురెడ్డి, ప్రసాద్, శ్రీనురెడ్డి, సుబ్బయ్య, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

యాజమాన్యాలు ప్రత్యేక శ్రద్ధ చూపాలి

- వీఎస్‌యూ వీసీ అల్లం శ్రీనివాసరావు



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

వెంకటాచలం: నూతన విద్యా విధానాలను సమర్థవంతంగా అమలు చేసేందుకు కళాశాలల యాజమాన్యాలు ప్రత్యేక శ్రద్ధ చూపాలని విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ) వీసీ అల్లం శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని కాకుటూరు వద్దనున్న వర్సిటీలో సోమవారం వివిధ కళాశాలల ప్రిన్సిపల్స్‌తో వీసీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన విద్యా విధానాన్ని (ఎన్‌ఈపీ – 2020) అనుసరించి సింగిల్ మేజర్ ప్రోగ్రాంలను డ్యూయల్ మేజర్ ప్రోగ్రాంలుగా మార్చడం వల్ల విద్యార్థులకు రెండు విభిన్న రంగాల్లో నైపుణ్యం పొందే అవకాశం కలుగుతుందన్నారు. ఇది కెరీర్ అభివృద్ధికి దోహదపడుతుందని చెప్పారు. అదే విధంగా అకడమిక్ బ్యాంక్ ఆఫ్ క్రెడిట్స్ (ఏబీసీ) వ్యవస్థను సమర్థవంతంగా అమలు చేయడం ద్వారా విద్యార్థులు దేశవ్యాప్తంగా వివిధ విద్యాసంస్థల నుంచి పొందిన క్రెడిట్లను ఒకే డిజిటల్ ప్లాట్‌ఫాంలో నిల్వ చేసుకోవచ్చన్నారు. దీని వల్ల చదువులో అనుకూలత, నైపుణ్యాల పెంపునకు దోహదపడుతుందని తెలియజేశారు. యోగాంధ్ర 2025 కార్యక్రమంలో విద్యార్థుల నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని, వివరాలను సమగ్రంగా నమోదు చేసి డేటాను డిజిటల్ ఫార్మట్‌లో సమీకరించడం చాలా ముఖ్యమని సూచించారు. సమావేశంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత, సీడీసీ హుస్సేనయ్య, ఎగ్జామ్స్ అధికారి డాక్టర్ ఆర్.మధుమతి, ప్రిన్సిపల్ సీహెచ్ విజయ, ఎస్‌ఎస్‌ఎస్ కో–ఆర్డినేటర్ డాక్టర్ ఉదయ్‌శంకర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం



స్వామి, అమ్మవార్ల పల్లకి సేవ



ప్రత్యేకాలంకరణలో మల్లికార్జున స్వామి

పొదలకూరు: మండలంలోని మరుపూరు కామాక్షి తాయి సమేత మల్లికార్జునస్వామి దేవస్థానం మూడో వార్షికోత్సవాన్ని గ్రామ పెద్దలు ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. పల్లకి సేవ వైభవంగా జరిగింది. కోరిన కోర్కెలు తీర్చే మల్లికార్జునుడిగా స్వామికి పేరుంది. పునాతన దేవాలయానికి గ్రామ పెద్దలు జీర్ణోద్ధరణ పనులు చేపట్టారు. ఇక్కడ గర్భగుడిలో శివలింగంపై ఉదయం వేళ సూర్యకిరణాలు పడటం ప్రత్యేకంగా చెప్పుకొంటారు. వైస్ ఎంపీపీ వేణుంబాక చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

శాస్త్రోక్తంగా ధ్వజారోహణ

ఇందుకూరుపేట: గంగపట్నంలోని చాముండేశ్వరీదేవి దేవస్థానంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం అర్ధరాత్రి ధ్వజారోహణను శాస్త్రోక్తంగా నిర్వహించారు. తొలుత అంకురార్పణ చేశారు. అమ్మవారికి ప్రత్యేక పూలంగిసేవ జరిపారు. ఉభయకర్తలుగా కర్పూరం సోదరులు వ్యవహరించారు. అర్చకుడు నూతలపాటి అనిల్‌శర్మ, మాచవోలు రామకృష్ణశర్మ, ముప్పిరాల కిశోర్ ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. అనంతరం ప్రసాదాల వితరణ జరిగింది. ఉభయదాతలుగా వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మావులూరు శ్రీనివాసులురెడ్డి, ఆయన సోదరుడు శ్రీధర్‌రెడ్డి– గిరిజమ్మ దంపతులు వ్యవహరించారు. ఈఓ తాతా శ్రీనివాసరావు పర్యవేక్షించారు.



విద్యుద్దీపాలంకరణలో ఆలయం

దుర్మార్గపు పాలనకు గుణపాఠం తప్పదు

- వైఎస్సార్‌సీపీ తిరుపతి పార్లమెంట్ పరిశీలకుడు మేడా రఘునాథరెడ్డి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): కూటమి ప్రభుత్వ దుర్మార్గపు పాలనకు గుణపాఠం తప్పదని, ప్రజలే తగిన బుద్ధి చెప్పే రోజు దగ్గర్లోనే ఉందని వైఎస్సార్‌సీపీ తిరుపతి పార్లమెంట్ పరిశీలకుడు, రాజ్యసభ ఎంపీ మేడా రఘునాథరెడ్డి హెచ్చరించారు. నగరంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో సిటీ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి, కాకాణి పూజిత ఆధ్వర్యంలో సర్వేపల్లి నియోజకవర్గ నాయకులు, కార్యకర్తల సమన్వయ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అరెస్ట్ అక్రమమని, కూటమి ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ఇదే విధంగా అక్రమ కేసులు పెడుతున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో 4వ తేదీ జరిగే వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని కార్యకర్తలు, నాయకులు విజయవంతం చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అక్రమాలను తెలిపేందుకు ఏర్పాటు చేసిన వెన్నుపోటు దినానికి ప్రజలంతా తరలిరావాలని కోరారు.



మాట్లాడుతున్న తిరుపతి వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకుడు మేడా రఘునాథరెడ్డి

ప్రజలు భారీగా తరలిరావాలి

ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో నిర్వహిస్తున్న వెన్నుపోటు దినం కార్యక్రమంలో ప్రజలు భారీగా తరలిరావాలని కోరారు. కూటమి నేతలు ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీల విషయంలో, డైవర్షన్ పాలిటిక్స్‌లో ప్రభుత్వం చేస్తున్న అరాచకాలను ప్రజల దృష్టికి తీసుకెళ్లాలని తెలిపారు. అరాచక పాలనలో భాగంగా మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై అక్రమ కేసును బనాయించి జైలుకు పంపారని మండిపడ్డారు. హామీల విషయంలో టీడీపీ నాయకులు రోడ్లపైకి వస్తే ప్రజలు నిలదీసేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.